క్లుప్తంగా

గ్లాస్‌లోడ్ లారీ బోల్తా

మనుబోలు : మనుబోలు-పొదలకూరు మార్గంలో గ్లాస్‌లోడ్‌తో వెళ్తున్న లారీ గురువారం బోల్తా పడింది. మనుబోలు హైవే నుంచి పొదలకూరు వైపు వెళ్తున్న లారీ అక్కంపేట వద్ద అదుపుతప్పి పడిపోవడంతో అందులో ఉన్న గ్లాసులన్నీ పగిలి రోడ్డు చిందరవందరగా పడిపోయాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రోగులకు మందులు అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అన్నారు. పట్టణంలోని ఇసుకపాళెం సచివాలయం-1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేదల కోసమే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, వైఎస్సార్‌సీపీ నేత కె.మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు షకీలాబేగం, ప్రవళిక, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంక్షేమానికి పెద్దపీట



మర్రి ఆకుపై మాతా శిశువుల చిత్రం

పొదలకూరు (ముత్తుకూరు) : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం గురువారం మర్రి ఆకుపై మాతా శిశువుల చిత్రాన్ని రూపొందించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తల్లులు, ఆడ బిడ్డల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సర్కారును ఈ చిత్రం ద్వారా అభినందించారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట) : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయగిరి, కోవూరు, నెల్లూరురూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమించారు. ఉదయగిరికి మాజీ జెడ్పీచైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కోవూరుకు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, నెల్లూరురూరల్‌కు మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మనుబోలు : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ముద్దుమూడి గ్రామంలో రూ.2.80 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో సబ్‌స్టేషన్‌లు, ఫీడర్లు, విద్యుత్ లైన్లు ఇతర పరికరాల కొనుగోలుకు రూ.43.17 కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే ఒక నియోజకవర్గంలో ఇంత పెద్ద ఎత్తున విద్యుత్ కోసం నిధులు ఖర్చు చేసిన దాఖలాలు లేవన్నారు. కొత్త సబ్‌స్టేషన్ ద్వారా కొమ్మలపూడి, ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాల ప్రజలకు అన్నిరకాలుగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను గుర్తించి ఎన్నికల కోడ్ రాక ముందే యుద్ధప్రాతిపదికన సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేయగలిగామన్నారు. దీని మొత్తం 1,837 కనెక్షన్‌లకు నాణ్యమైన విద్యుత్ అందించవచ్చని తెలిపారు. ఎలక్ట్రికల్ ఎస్‌ఈ విజయన్, ఈఈలు జయకృష్ణారెడ్డి, శ్రీధర్, ఏడీ సురేంద్ర, నాగార్జున, ఎంపీడీఓ ప్రసాద్ పాల్గొన్నారు.

కెమికల్ లీకేజీపై మాక్‌డ్రిల్



పొదలకూరు (ముత్తుకూరు) : ఫ్యాక్టరీల్లో ఊహించని విధంగా కెమికల్ లీకేజీ జరిగితే ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అదానీ కృష్ణపట్నంపోర్టులోని బీపీసీఎల్ వద్ద డీజిల్ ట్యాంక్ లీకైన ఘటన ఆధారంగా ఆఫ్ సైట్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. డీజిల్ లీకైన వెంటనే ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల వారు 55 మందిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. క్షతగాత్రులైన ఐదుగురిని ముత్తుకూరు పీహెచ్‌సీకి, మరో ఐదుగురిని అదానీ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో నెల్లూరు ఆర్డీఓ మలోల, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్, డీఎఫ్‌ఓ శ్రీనివాసులు, ఫ్యాక్టరీస్ డీపీఎం వీరశేఖర్, సేఫ్టీ ఆఫీసర్లు విజయకుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

తిట్టిన నోటితోనే పొత్తు రాగం

- సింగిల్‌గానే సీఎం జగన్ పోటీ
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఈద్గా ప్రహరీని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తిట్టిన నోటితోనే చంద్రబాబు పొత్తు రాగం ఆలపిస్తున్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింగిల్‌గానే పోటీ చేస్తారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులో రూ.26 లక్షలతో నిర్మించిన ఈద్గా ప్రహరీని మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లింలను ఉద్దేశించి మాట్లాడుతూ తమది సెక్యులర్ పార్టీ అని, వైఎస్సార్‌సీపీలో ముస్లింలకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. దివంగత వైఎస్సార్ హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ ఇవ్వడం వల్ల వారు ఉన్నతంగా చదువుకోగలుగుతున్నట్లు చెప్పారు. కరోనా కష్టకాలంలో ముస్లింలు రంజాన్ పండగ జరుపుకోలేని పరిస్థితుల్లో తన సొంత నిధులతో పండగ సామగ్రిని అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. నియోజకవర్గంలో ముస్లిం శ్మశానవాటికలకు నిధులను మంజూరు చేశామన్నారు. పగటి వేషగాళ్ల విన్యాసాలు నమ్మవద్దని, వైఎస్సార్‌సీపీకి ముస్లింలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ముస్లిం మతపెద్ద ముస్తాక్‌మదనీ, ఖాదర్, అంజాద్, నౌరోజ్, గౌస్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన హాజీలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులే మా బలం

పొదలకూరు పట్టణంలో మా కుటుంబానికి ఆర్యవైశ్యులే బలమని, మా తండ్రి కాకాణి రమణారెడ్డి హయాం నుంచి ఆర్యవైశ్యులు మాకు అండగా నిలబడ్డారని మంత్రి కాకాణి తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో పునర్నిర్మించిన శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఎస్సీఎస్సార్ కల్యాణ మండపంలో సర్వేపల్లి స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆర్యవైశ్యులు రాజకీయాలకు అతీతంగా ఉంటారని, వారి మనస్సుల్లోని నాయకులను అభిమానించి ఓట్లు వేస్తారన్నారు. అయితే అందుకు అతీతంగా మా కుటుంబాన్ని అభిమాస్తున్నారని, తాము కూడా వారిని అదేస్థాయిలో అభిమానించి ఏది అడిగినా కాదనకుండా చేసి పెడుతున్నట్లు తెలిపారు. పొదలకూరులో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు స్థలాన్ని కేటాయించేందుకు హామీ ఇచ్చారు. తాను మంత్రి అయిన తర్వాత వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా రూ.2 కోట్లతో మెయిన్ బజార్లో సిమెంటురోడ్డును నిర్మించినట్లు చెప్పారు. తొలుత ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నేతలు ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆకులూరు హేమంత్‌కుమార్, అమరా భగవాన్, ఆకులూరు మధు, తరుగు ప్రభాకర్, తన్నీరు సుబ్రహ్మణ్యం, కాకుమాని నారాయణ, కేసర్ల రవి, దామిశెట్టి రవి, చందు, చాట్ల కోటేశ్వరావు, ఆకులూరు అనూరాధ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం చిన బ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ పాల్గొన్నారు.



శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి

నార్తురాజుపాళెం రూపురేఖలు మార్చాం



రూ.6.75 కోట్లతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : ఎన్నికల్లో చెప్పినట్లుగానే నార్తురాజుపాళెం రూపురేఖలు మార్చి చూపించామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని బొడ్డువారిపాళెం, నార్తురాజుపాళెంలలో రూ.7.92 కోట్ల అభివృద్ధి పనులకు ఆయన గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నార్తురాజుపాళెం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రూ.6.75 కోట్లతో ఎంతో ప్రాముఖ్యత కలిగిన జాతీయ రహదారి నుంచి బొడ్డువారిపాళెం, గువ్వగుంటల మీదుగా కూనంపాడు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అదేవిధంగా నార్తురాజుపాళెం మజరా టపాతోపులో రూ.7.50 లక్షలతో వాటర్ ప్లాంట్, నార్తురాజుపాళెంలో రూ.45 లక్షలతో సిమెంట్ రోడ్డు, రూ.10 లక్షలతో సంగీత కళాశాల ప్రహరీ, రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు, టపాతోపులో రూ.10 లక్షలతో సైడ్ డ్రెయిన్స్‌ను ప్రారంభించామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్మోహన్‌రెడ్డికి రెండు కళ్లన్నారు.

ఎవరు వెళ్లినా భయపడం

పార్టీని ఎవరు వీడినా భయపడేది లేదని ఎమ్మెల్యే ప్రసన్న స్పష్టం చేశారు. ఓ ముస్లింకు నెల్లూరు సీటు ఇచ్చారని ఓ కోటీశ్వరుడు పార్టీని వీడడం దారుణమన్నారు. ఆయన్ను రాజ్యసభకు పంపడంతో పాటు ఆయన భార్యకు టీటీడీ సభ్యత్వం ఇస్తే వాటిని అనుభవించి పార్టీని వీడడం శోచనీయమన్నారు. ఎందరు పార్టీని వీడినా ప్రజల మనస్సుల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రసన్న నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడమే కాకుండా వ్యక్తిగతంగానూ ఎంతో మందికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల కన్వీనర్ కె.శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ బి.సుప్రియ, ఎంపీటీసీ పి.అనిల్‌కుమార్‌రెడ్డి, నేతలు ఎ.మోహనకృష్ణ, ఐ.సునీల్‌రెడ్డి, ఎస్.మాణిక్యరావు, ఎం.రంగారెడ్డి, ఆర్.రాజేష్‌రెడ్డి, డి.శివకుమార్, ఎండి.కరిముల్లా, డి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.శ్రీధర్‌రెడ్డి, సీహెచ్.మనోహర్, సీహెచ్.శేషగిరి, పి.మల్లికార్జున పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- వీఎస్‌యూ వీసీ సుందరవల్లి
- ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవం



ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టు సీఈఓ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

వెంకటాచలం : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి ఆకాంక్షించారు. మండలంలోని కాకుటూరు వద్ద నున్న వీఎస్‌యూలో మహిళా దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమన్నారు. గతంతో పోల్చుకుంటే ఉన్నత విద్య చదివే స్త్రీల సంఖ్య పెరిగిందని, మహిళలు చైతన్యవంతులయ్యారని తెలియజేశారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మహిళలను తక్కువ చేసి మాట్లాడటం, కించ పరచడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయానంద్ కుమార్‌బాబు, డాక్టర్ సుహాసిని, సి.విజయ, డాక్టర్ మధుమతి, సీహెచ్.విజయ, డాక్టర్ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

ముందుండాలి

పొదలకూరు (ముత్తుకూరు) : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని అదాని కృష్ణపట్నంపోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోర్టులో గురువారం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఈఓ సమక్షంలో పోర్టులో పనిచేసే మహిళా ఉద్యోగులు, సిబ్బంది భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎందరో మహిళలు పోరాటాలు చేసి హక్కులు సాధించారని గుర్తుచేశారు. గతంలో తొమ్మిది శాతం ఉన్న మహిళల అక్షరాస్యత ప్రస్తుతం 77 శాతానికి చేరడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో క్రీడల పోటీలు జరిపి, విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళల పాత్ర ఉన్నతమైనది

పొదలకూరు : కుటుంబంలో మహిళల పాత్ర ఉన్నతమైనదని, పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాలని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ పేర్కొన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినట్లు గుర్తుచేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.పద్మజా, జ్యోతిలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమా అరుణ, బొల్లినేని భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఏదైనా సాధించగలరు

మనుబోలు : మహిళలు ఎందులోనూ తక్కువ కాదని, ఏదైనా సాధించగలరని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బద్దెవోలు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం మహిళా సాధికారతపై సూపర్‌వైజర్ రమణమ్మ అవగాహన కల్పించారు. ప్రస్తుత కాలంలో స్త్రీలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఆడపిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు.



వెంకటాచలం : మహిళలను సన్మానిస్తున్న వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి



మనుబోలు : మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ



పొదలకూరు : విజేతలకు బహుమతుల అందజేత

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పొదలకూరు : పట్టణంలోని శతాబ్దాల నాటి కామాక్షితాయి సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) దేవస్థానంలో గురువారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉభయకర్తగా కోడూరు శ్రీనివాసులు-వెంకటసుబ్బమ్మ దంపతులు వ్యవహరించారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు.

కాశీనాయన ఆశ్రమంలో..

మండలంలోని వరదాపురానికి సమీపంలో ఉన్న కాశీనాయన ఆశ్రమంలో పంచలింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆశ్రమ పీఠాధిపతి సిద్ధేశ్వరస్వామి గురువారం వెల్లడించారు. ప్రత్యేక పూజలు, శివరాత్రి జాగరణ, సిద్ధేశ్వరస్వామి సత్యబోధన, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మంత్రి కాకాణి పరామర్శ

మనుబోలు : మండలంలోని గురివిందపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మన్నెమాల సుధీర్‌రెడ్డి తండ్రి మన్నెమాల చెంచుకృష్ణారెడ్డి బుధవారం రాత్రి కన్నుమూశారు. దీంతో మంత్రి కాకాణి గురువారం చెంచుకృష్ణారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారులు సుధీర్‌రెడ్డి, వసంతకుమార్‌రెడ్డిలను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు మన్నెమాల శ్రీహరిరెడ్డి, చేవూరు ఓసూరయ్య, ఏడెం మల్లికార్జునరెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం



సుధీర్‌కుమార్‌కు అవార్డు అందజేస్తున్న ఎంఈఓలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ గురువారం మాతృభాషా సేవా పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలమనేరులో ఉన్న తెలుగు సాహిత్య, సాంస్కృతిక సంస్థ మాతృభాష ఔన్నత్యానికి కృషి చేస్తున్న పలువురికి అవార్డు పంపింది. అందులో భాగంగా ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్‌కు మండల విద్యాశాఖాధికారులు పీవీ రత్నం, దిలీప్‌కుమార్ అవార్డు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

13 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అధ్యక్షత వహించి, మాట్లాడారు. సమావేశంలో 13 అంశాలను ప్రవేశపెట్టినట్లు వివరించారు. అన్ని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమణబాబు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలే మెజారిటీ



జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మహిళలు

మనుబోలు : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పురుషులు కన్నా స్త్రీలే అధికంగా ఉన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌తో కలిపి మొత్తం 27 మందికి గానూ 18 మంది మహిళలే. వీరిలో 14 మంది ఉపాధ్యాయినులు కాగా నలుగురు నాన్ టీచింగ్‌లో ఉన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వారంతా ఒకే రకమైన దుస్తులు ధరించి సందడి చేశారు.

రెండు బైక్‌ల ఢీ

- ఇద్దరికి గాయాలు

పొదలకూరు : మండలంలోని కనుపర్తి క్రాస్‌రోడ్డు వద్ద రెండు మోటార్‌బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు గాయపడ్డారు. చేజర్లకు చెందిన యువకుడు, కనుపర్తికు చెందిన యువకుడు గాయపడినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, గాయపడిన కనుపర్తి యువకుడిని పొదలకూరు సీహెచ్‌సీకి తరలించారు.

నేడు రామచంద్రాపురంలో ఎన్నికల ప్రచారం

కోవూరు : స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరు మండలం రామచంద్రాపురం పాతూరులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం జెడ్పీహైస్కూల్‌లో వంద మంది టెన్త్ విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు, మాధవి, హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కృష్ణపట్నానికి మంత్రి కాకాణి రాక నేడు

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఉదయం కృష్ణపట్నం గ్రామానికి వస్తారని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత రాగాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో భాగంగా మహాశివరాత్రి సందర్భంగా స్థానిక సిద్ధేశ్వరాలయంలో మంత్రి కాకాణి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని వెల్లడించారు.

పరీక్ష సామగ్రి అందజేత



కోవూరు : మండలంలోని ఇనమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం పరీక్ష సామగ్రిని అందజేశారు. అక్షత ఫౌండేషన్ నిర్వాహకుడు మైథిలీ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో వీటిని అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ చెంచులక్ష్మి, హెచ్‌ఎం నరసింహమూర్తి, దాత మారంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

శివయ్యకు కళా వందనం



మనుబోలు : పెన్సిల్ మధ్యలో శివలింగం



పొదలకూరు : రావి ఆకుపై మహాశివుడు

మనుబోలు : మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము పెన్సిల్ మధ్యలో శివలింగాన్ని తయారు చేశాడు. దానిని గురువారం గ్రామస్తుల ముందు ప్రదర్శించి అబ్బురపరిచాడు. పెన్సిల్ మధ్యలో ఉన్న గ్రాఫైట్‌తో శివలింగాన్ని మలిచినట్లు తెలిపాడు.

- పొదలకూరు : మండలంలోని నల్లపాళెం గ్రామానికి చెందిన అమరావతి అనే మహిళ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రావి ఆకుపై మహాశివుడి బొమ్మను గీశారు. ఈమె గతంలో కూడా అనేక కళాత్మక ఆకృతులను గీశారు.